## క్లుప్తంగా

### కౌన్సిలర్లకు నోటీసులు జారీ

**నకిరేకల్:** నకిరేకల్ మున్సిపల్ చైర్మన్ ఎన్నిక వచ్చే నెల 3వ తేదీన జరగనున్న నేపథ్యంలో మున్సిపల్ కౌన్సిలర్లకు ఫాం -3 నోటీసులు అందజేసే ప్రక్రియ మున్సిపల్ అధికారులు శనివారం పూర్తి చేశారు. మొత్తం 20మంది వార్డు కౌన్సిలర్లకు నోటీసులు అందజేశామని కమిషనర్ బాలయ్య తెలిపారు.

### లండన్ పర్యటనకు వెళ్లిన ఎమ్మెల్యే వీరేశం



విమానాశ్రయంలో ఎమ్మెల్యే వీరేశంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు

**నకిరేకల్:** నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం శనివారం లండన్ పర్యటనకు బయలుదేరారు. దీంతో ఆయనకు హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయంలో నకిరేకల్ నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నేతలు, అభిమానులు వీడ్కోలు పలికారు. ఎమ్మెల్యే తిరిగి వచ్చే నెల 8న స్వదేశానికి రానున్నారు.

### కుదిరిన సమోధ్య

**– తెరుచుకున్న మొబైల్ దుకాణాలు**

**రామగిరి(నల్లగొండ):** నల్లగొండ జిల్లా కేంద్రంలో మొబైల్ షాపుల మధ్య చెలరేగిన వివాదం సద్దుమనిగింది. షాపుల మధ్య నెలకొన్న లోకల్ వర్సెస్ నాన్ లోకల్ వివాదంతో నాలుగు రోజుల పాటు షాపులు మూతపడ్డాయి. లోకల్ షాపు నిర్వాహకుల డిమాండ్లకు తలొగ్గిన హోల్ సేల్స్ రిపే రాజస్థాన్ షాపు యజమానులు మెట్టు దిగి వచ్చారు. స్థానిక షాపుల నిర్వాహకులు మొబైల్ షాపులకు మాత్రమే హోల్‌సేల్ వ్యాపారం చేయాలని, హోల్‌సేల్ దుకాణాల్లో రిటైల్ రిపేరింగ్ చేయమని ప్రధాన డిమాండ్లకు రాజస్థాన్ షాపుల యజమానులు ఒప్పుకున్నారు. దీంతో ఇద్దరి మధ్య నెలకొన్న వివాదానికి తెరపడినట్లయింది. శనివారం యథావిధిగా షాపులు తెరుచుకోవడంతో సమస్య ముగిసినట్లయింది.

### మున్సిపల్ కార్మికులకు రక్షణ కవచాలు పంపిణీ

**నల్లగొండ టూటౌన్:** స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కార్మికులకు శనివారం మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ రక్షణ కవచాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నాగరాజు, శ్రీనివాస్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

### ఎన్‌జీ కాలేజీ విద్యార్థిని ప్రతిభ

**రామగిరి(నల్లగొండ):** ఎన్జీ కళాశాలలో బి.ఏ. తృతీయ సంవత్సరం చదువుతున్న ఎమ్. నర్మద యువజనోత్సవాల్లో ప్రథమ బహుమతి గెల్చుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ తెలిపారు. నర్మద పాడిన తెల్లవారి కోడి కూత కోయిలమ్మ తేనె పాట అనే పాటకు జానపదం సోలో విభాగంలో ప్రథమ స్థానం లభించిందని తెలిపారు. శనివారం నర్మదను ప్రిన్సిపాల్, కల్చరల్ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీధర్ అభినందించారు. కార్యక్రమంలో మహిళా సాధికారికత విభాగం కన్వీనర్ భాగ్యలక్ష్మి, ఎన్ ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు మల్లేశం, వెంకట్‌రెడ్డి, కోటయ్య, అధ్యాపకులు శివరాణి, సావిత్రి పాల్గొన్నారు.

### హరిత హోటల్ ఏర్పాటుకు స్థల పరిశీలన

**నార్కట్‌పల్లి :** నార్కట్‌పల్లి మండలం ఎల్లారెడ్డిగూడెంలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో హరిత హోటల్ ఏర్పాటుకు శనివారం నల్లగొండ ఇన్‌చార్జి ఆర్డీఓ శ్రీదేవి స్థల పరిశీలన చేశారు. చెర్వుగట్టు రెవెన్యూ పరిధిలో గల 280 సర్వే నంబర్‌లోని 3 ఎకరాల స్థలంలో హోటల్ నిర్మించనున్నట్లు తెలిపారు. హోటల్ ఏర్పాటుకు స్థలం అనుకూలంగా ఉందని, ఉన్నతాధికారులకు నివేదిక అందజేయనున్నట్లు తెలిపారు. ఆమె వెంట తహసీల్దార్ వెంకటేశ్వర రావు తదితరులు ఉన్నారు.



వీకెండ్ ఫుడ్

**ఆదివారం** వచ్చిందంటే చికెన్, మటన్, బోటీ, తలకాయ, చేపలు.. ఇలా ఏదో ఒక మాంసాహారం తినాల్సిందే. పేదల నుంచి ధనవంతుల వరకు వారాంతం చాలా కష్టపడి ఆరోజు ఇంటి పట్టున ఉండి.. కాస్త నాలుకకు రుచి తగిలేలా నాన్‌వెజ్ తినేందుకు ఇష్టపడుతున్నారు. ఈ కాలంలో కొందరు ఎప్పుడు తినాలనిపిస్తే అప్పుడు.. వారంలో మూడు నాలుగు రోజులకు కూడా నాన్‌వెజ్ తింటున్నారు. ఇలా ప్రజల అభిరుచులు మారడంతో నాన్‌వెజ్ విక్రయాలు కూడా పెరిగాయి. - నల్లగొండ టూటౌన్

# ముక్క.. ఎక్కువే!

## ఆదివారం ఒక్కరోజే 183 క్వింటాళ్ల నాన్‌వెజ్ అమ్మకం

**నల్లగొండ పట్టణంలో భారీగా పెరిగిన మాంసం విక్రయాలు**

- సండే వచ్చిందంటే నాన్‌వెజ్ తినాల్సిందే
- కొందరు వారంలో మూడు రోజులు మాంసాహారమే..

సండే స్పెషల్

**ఒ**కప్పుడు పండుగలప్పుడే ఇంట్లో ఘుమఘుమల వాసన వచ్చేది. ఆ రోజు తమకు నచ్చిన మాంసం తెచ్చి వండేవారు. ఇంటికి బంధువులు వస్తే నాటు కోడి కోసి పెట్టేవారు. కానీ ఎప్పుడు, పడితే అప్పుడు మాంసం తినే రోజులు ఉండేవి కావు. నూటికి 95 శాతం మంది అప్పట్లో కూరగాయల భోజనమే తిని కడుపు నింపుకునేవారు. భోజనం కోసం అష్టకష్టాలు పడ్డ పేదలు, మధ్య తరగతి ప్రజలు కడుపు నిండా భోజనం చేస్తే చాల్లే అనుకునే రోజుల నుంచి ముక్క ఉంటేనే ముద్ద నోట్లోకి పోయే రోజు వచ్చింది. ప్రస్తుతం ఎవరూ ఖర్చుకు వెనకడుగు వేయకుండా ఆదివారం వచ్చిందంటే చాలు తప్పనిసరిగా చికెన్, మటన్, చేపలను తింటున్నారు. కొందరు వారంలో మూడు రోజులు నాన్‌వెజ్ తింటున్నారు.



నీలగిరి పట్టణంలోని 48 వార్డుల్లో 2లక్షలకు పైగా జనాభా ఉంది. పట్టణంలో దాదాపు ప్రతి ఆదివారం 550 నుంచి 600 మంది 1300 నుంచి 1500 యాట పోతులను కోస్తుంటారు. ఆ ఒక్క రోజే 23 క్వింటాళ్ల యాట మాంసం విక్రయం అవుతుంది. ఇక, రోజూ 10 క్వింటాళ్ల యాట మాంసం అమ్ముడుపోతుంది. తలకాయ మాంసం, బోటికి ఉన్న డిమాండ్ మటన్‌కు కూడా ఉండడం లేదంటే అతిశయోక్తి కాదు. చికెన్ ఇక, రోజువారీగా 10 క్వింటాళ్ల వరకు వినియోగదారులు కొనుగోలు చేస్తుండగా.. ఆదివారం 100 క్వింటాళ్లకు పైగానే అమ్మకాలు జరుగుతున్నాయి. చేపలు రోజుకు 12 క్వింటాళ్లు అమ్ముడవుతుండగా, ఆదివారం రోజు 60 క్వింటాళ్ల పచ్చి చేపల విక్రయాలు జరుగుతున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు.

**సండే రోజు 183 క్వింటాళ్ల నాన్‌వెజ్**



**మటన్ ఎక్కువగా ఇష్టపడతారు**

రోజూ యాట పోతులను కోస్తాం. వినియోగదారులు మటన్ చాలా ఇష్టంగా తీసుకుపోతారు. ఎక్కువ మంది వారంలో రెండుసార్లు కూడా మాంసం తినేందుకు ఇష్టపడుతారు. తలకాయం, బోటికి ఎక్కువగా డిమాండ్ ఉంటుంది.

- శంకర్‌జీ, మటన్ వ్యాపారి, నల్లగొండ

**కొవ్వు లేని మాంసం చేపలే**



ప్రస్తుతం పరిస్థితుల్లో యాట మాంసం తినడం ద్వారా ఫ్యాట్ వస్తుందనే కారణంతో ఎక్కువగా చేపలు తినేందుకు ఆసక్తి చూపుతున్నారు. కొంతమంది వారంలో మూడు, నాలుగు రోజులు చేపలు తీసుకుపోతుంటారు.

- సింగం శ్రీను, చేపల వ్యాపారి, నల్లగొండ

**వారంతో పనిలేదు**



ప్రస్తుతం మార్కెట్‌లో కూరగాయల ధరలు కూడా అధికంగా ఉన్నాయి. వాటితో పోల్చుకుంటే చికెన్ ధరలే తక్కువ ఉండడంతో నాణ్యమైన చికెన్ తినేందుకు వినియోగదారులు ముందుకొస్తున్నారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా ఎప్పుడు తినాలనిపిస్తే అప్పుడు చికెన్ తీసుకుపోతారు.

- జి.అంజయ్య, చికెన్ వ్యాపారి, నల్లగొండ

**చేపలే రుచిగా ఉంటాయి**



చికెన్, మటన్ కన్నా చేపల కూర చాలా రుచిగా ఉంటుంది. పిల్లలు కూడా ముల్లు లేకుండా పెడితే ఇష్టంగా తింటారు. వారంలో మధ్యలో కూడా ఏదో ఒక మాంసం తింటాం. పిల్లల రుచులను కాదనలేం. వారికి ఏది ఇష్టం అయితే అదే తీసుకుపోతాం. చిన్నతనంలో వారికి కావాల్సింది పెడితే కడుపు నిండా తింటారు.

- పరమేష్, వినియోగదారుడు, నల్లగొండ

**వారంలో రెండు సార్లు చికెన్**



మాకు ఎప్పుడు తినాలనిపిస్తే అప్పుడు వెంటనే చికెన్ తీసుకుపోతాం. కొన్ని రకాల కూరగాయలు తినలేం. దాంతో వారంలో రెండు సార్లు చికెన్ తినడానికే ఇష్టపడుతాం. ఎవరికైనా మాంసం కూర అయితేనే ఓ ముద్ద ఎక్కువ తినాలనిపిస్తుంది.

- ప్రశాంత్, వినియోగదారుడు, నల్లగొండ

## భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

**నల్లగొండ టౌన్:** భగత్‌సింగ్ జయంతి సందర్భంగా శనివారం దొడ్డి కొమరయ్య భవన్‌లో ఎస్ఎఫ్ఐ నాయకులు ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఆకారపు నరేష్, కంభంపాటి శంకర్, కుంచం కావ్య, స్పందన, పావని, కిరణ్, సాయి, సందీప్, సంజయ్, బన్ని, పాల్గొన్నారు.

**రక్తదానం ప్రాణదానంతో సమానం**

**చిట్యాల:** రక్తదానం ప్రాణదానంతో సమానమని చిట్యాల మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, నార్కట్‌పల్లి సీఐ నాగరాజు అన్నారు. భగత్ సింగ్ జయంతి సందర్భంగా చిట్యాలలో శనివారం ఆసరా స్వచ్ఛంద సేవా సంస్థ, మాతృదేవోభవ పితృదేవోభవ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు.



చిట్యాల: రక్తదాన శిబిరంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్, సీఐ

కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు జడల చినమల్లయ్య, దుర్గా ఆలయ చైర్మన్ మారగోని అంజనేయులు, కౌన్సిలర్ బెల్లి సత్తయ్య, మాజీ ఎంపీటీసీ గుండెబోయిన సైదులు, జిట్ట బిక్షం, మేడి హరికృష్ణ, బొబ్బల రాంరెడ్డి, సుంచు సైదులు, కోల్లోజు శ్రీకాంత్, చోల్లేటి శ్రీకాంత్, కురుమేటి నవీన్, తీగల శివ పాల్గొన్నారు.

**నకిరేకల్‌లో..**

**నకిరేకల్ :** భగత్ సింగ్ స్ఫూర్తితో విద్యార్థి ఉద్యమాలు చేపడతామని ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి ముస్కు రవీందర్ అన్నారు. నకిరేకల్‌లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్ సింగ్ చిత్రపటానికి ఆయన పూల మాలలు వేసి నివాళ్లర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో ఆసంఘ ప్రతినిధులు కత్తుల సాయి,కిరణ్, ముస్కు శ్రీనాథ్ ,గణేష్, అజయ్,చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు అందుబాటులో ఉండాలి

- జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి

**తిప్పర్తి:** గ్రామీణ సమస్యలు పరిష్కరించేందుకు పంచాయతీ రాజ్ శాఖ సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని జిల్లా పరిషత్ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన తిప్పర్తి మండలపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ..సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలన్నారు. అనంతరం మండల కేంద్రంలోని అమ్మ ఆదర్శ పాఠశాలగా ఎంపికైన ఉన్నత పాఠశాలను సీఈఓ సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీఓ జానయ్య, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



తిప్పర్తి : మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ

**పెంపుడు జంతువులతో జాగ్రత్తగా ఉండాలి**

**నల్లగొండ టౌన్:** కుక్కలు, పెంపుడు జంతువులతో రేబిస్ వ్యాధి వ్యాప్తి చెందుతుందని, ఈ నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అడిషనల్ డైరెక్టర్లు డాక్టర్ సురేష్, డాక్టర్ మల్లిఖార్జున్ సూచించారు. ప్రపంచ రేబిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం నల్లగొండలోని బాలికల పాఠశాలలో విద్యార్థినులకు రేబిస్ వ్యాధిపై నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడుతూ కుక్క కాటుకు గురైన వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలన్నారు. పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్ వేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మంత్రి సహకారంతో నీలగిరి అభివృద్ధి

- జిల్లా కేంద్రంలో రూ. 21 కోట్లతో వరద కాల్వల నిర్మాణం
- రూ. 55 కోట్లతో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు
- మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి

**నల్లగొండ టూటౌన్:** మంత్రి కోమటిరెడ్డి సహకారంతో నీలగిరిని అభివృద్ధి చేస్తామని మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన కౌన్సిల్ సమావేశానికి అధ్యక్షత వహించి మాట్లాడారు. పట్టణంలో 186 కిలో మీటర్ల అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు కొనసాగుతున్నాయని, రూ.55 కోట్లతో సీసీ రోడ్లు వేస్తున్నట్లు తెలిపారు. కాలనీలు వరద ముంపునకు గురి కాకుండా రూ.21 కోట్లతో వరద కాల్వ నిర్మాణం చేపడుతున్నామన్నారు. పట్టణంలో అమృత్ పథకం కింద తాగునీటి ట్యాంకుల నిర్మాణం పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఎస్‌డీఎఫ్ కింద రూ.238 కోట్లు నిధులు మంజూరు చేయాలని మంత్రి ద్వారా సీఎంను కలిసి విన్నవించామన్నారు. త్వరలోనే అనుమతులు వస్తాయని, శివారు కాలనీల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించవచ్చన్నారు. కౌన్సిలర్ ఖయ్యూంబేగ్ మాట్లాడుతూ ఖర్చులు పెరుగుతున్నందున ఆదాయ వనరులు పెంచుకునే మార్గాన్ని ఆలోచించాలని కోరారు. కౌన్సిలర్ పిల్లిరామరాజుయాదవ్ మాట్లాడుతూ అన్ని వార్డుల్లో ఒకేసారి అభివృద్ధి పనులు పూర్తయ్యేలా చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కౌన్సిలర్ కర్నాటి కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ శాంతినగర్‌లో కుక్కల సమస్య తీవ్రంగా ఉందని సమస్య పరిష్కరించాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, ఈఈ రాములు, ఇతర అధికారులు, పాలక వర్గ సభ్యులు పాల్గొన్నారు.

## కనీస వేతనాలు ఇవ్వాలని కలెక్టరేట్ ఎదుట ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

**నల్లగొండ టౌన్:** కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్ కార్మికులకు రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్. లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. సీఐటీయూ జాతీయ కమిటీ పిలుపు మేరకు శనివారం కార్మికులతో కలిసి కలెక్టరేట్ ధర్నా నిర్వహించి మాట్లాడారు. సంపద సృష్టిస్తున్న కార్మికులకు, అనేక సేవలు అందిస్తున్న ఉద్యోగులకు కనీస వేతనాలు ఇవ్వకుండా ప్రభుత్వాలు వెట్టి చేయిస్తున్నాయని విమర్శించారు. చట్టబద్ధంగా కార్మికులకు పీఎఫ్, ఈఎఫ్, ఈఎస్ఐ, బోనస్, గ్రాట్యుటీ ఇవ్వాలని, చట్టాలు ఉన్నప్పటికి యజమానులు అమలు చేయడంలేదని ఆరోపించారు. ఈ నెల 30న జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం అదనపు జేసీ పూర్ణచంద్రకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో దండంపల్లి సత్తయ్య, పోలె సత్యనారాయణ, సైదాచారి, ముత్యాలు, బొంగరాల మల్లయ్య, పల్లె నగేష్, ఆర్.శ్రీనివాస్, అరుణ పాల్గొన్నారు.

### ఉర్సు ఘనంగా నిర్వహించాలి

**రామగిరి (నల్లగొండ):** వచ్చేనెల 17న జరిగే లతీఫ్ షా ఉల్లాఖాద్రి దర్గా ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి కోరారు. జిల్లా కేంద్రంలోని గడియారం సెంటర్ దామన్ దర్గా ప్రాంగణంలో ఉర్సు కమిటీ శనివారం ఏర్పాటు చేసిన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉర్సుకు అన్ని ఏర్పాట్లు మున్సిపాలిటీ చేస్తుందన్నారు. దర్గా మరమ్మతులకు రూ.9 లక్షలు కేటాయించామన్నారు. అనంతరం కమిటీ సభ్యులు మాట్లాడుతూ అక్టోబర్ 17న ఉత్సవాలు ప్రారంభమై నెల రోజులు జరుగుతాయని తెలిపారు.



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్, నవీన్ గౌడ్, సయ్యద్ సమద్, ఫసద్ అలీ బాబా, మహబూబ్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

### ప్లాస్టిక్‌ను నిషేధించాలి



ప్లాస్టిక్ వస్తువులను సేకరిస్తున్న విద్యార్థినులు

**నార్కట్‌పల్లి :** గ్రామాల్లో ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని నల్లగొండలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పవిత్రవాణి కర్ష అన్నారు. ఆ మహిళా డిగ్రీ కళాశాలలోని ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థులు శనివారం నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టులో గల శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి లాలయ ఆవరణలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ సేకరణ చేపట్టారు. ఆలయ ఆవరణలో విద్యార్థినులు 150 కిలోల ప్లాస్టిక్‌ను సేకరించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు అపర్ణ, షేక్ సుల్తానా ఉన్నారు.

### కరపత్రం ఆవిష్కరణ

**రామగిరి(నల్లగొండ):** తెలంగాణ సాహితీ దశాబ్ది ఉత్సవాల కరపత్రాలను స్థానిక ఎన్జీ కళాశాలలో శనివారం ఆవిష్కరించారు. తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ తండు క్రిష్ణ కౌండిన్య మాట్లాడుతూ సంస్థ ఏర్పడి పది సంవత్సరాలు పూర్తి చేసుకుందన్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి నల్లగొండలోని పీజీ, యూజీ విద్యార్థులకు కవిత పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు గోవర్ధన్,మహ్మద్‌హుసేనా,ఆనంద్ పాల్గొన్నారు.

### లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**నకిరేకల్ :** లోక్ అదాలత్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని నకిరేకల్ మున్సిఫ్‌కోర్టు జూనియర్ సివిల్ జడ్జి షేక్ ఆరీఫ్ సూచించారు. స్థానిక మున్సిఫ్ కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీమార్గం రాజ మార్గమన్నారు. లోక్ అదాలత్‌లో 118 క్రిమినల్ కేసులకు రాజీ కుదిర్చారు. 41కేసులకు జరిమానా విధించారు. మరో 10 సివిల్ కేసుల వారు కూడా రాజీపడ్డారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన 98మందికి రూ.4.50లక్షల జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పూజర్ల శంభయ్య, న్యాయవాదులు పాల్గొన్నారు.

### బీజేపీదే అధికారం

**మునుగోడు:** రానున్న రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శనివారం మునుగోడులో నిర్వహించిన ఆ పార్టీ నియోజకవర్గస్థాయి సభ్యత్వ నమోదు సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో అధికారంలో కొనసాగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం మాటలు తప్ప చేతలు కన్పించడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి పార్టీ సభ్యాత్వాల సంఖ్య పెంచాలని సూచించారు. సమావేశంలో నాయకులు తూండ్ల రవీందర్ గౌడ్, దూడల బిక్షం గౌడ్, దర్శినం వేణు, బొడిగె అశోక్ గౌడ్, సామ నర్సింహ, పెంబళ్ల జానయ్య, కాసాల జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం

**చతుర్ముఖ సాయి విగ్రహావిష్కరణ**

**చిట్యాల:** మండలంలోని వట్టిమర్తి గ్రామ పరిధిలోని సాయి ఆలయంలో శనివారం నూతనంగా చతుర్ముఖ సాయి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఇమ్మడి రమేష్, బత్తుల ఊషయ్య, ఇమ్మడి వెంకన్న, ఉప్పల కోటయ్య, వడ్డెగోని నర్సింహలు ఈ విగ్రహ ఏర్పాటుకు సహకరించారు. కార్యక్రమంలో సాయి గురుస్వామి కేవీబీ స్వామి, పురోహితులు పీవీ రమణమూర్తి, సాయి సేవక్‌లు శంకుతల, అనురాగ్, హైమ, నర్మద, వాణి, లక్ష్మీ, దుర్గ, మానస, దశరథ, సత్యవతి, రవి,వేణుమాధవ్ పాల్గొన్నారు.

**మాజీ జెడ్పీటీసీకి కన్నీటి వీడ్కోలు**

**నాంపల్లి:** మండల కేంద్రానికి చెందిన మాల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, మాజీ జెడ్పీటీసీ కర్నాటి రామలింగం అనారోగ్యంతో శనివారం మృతిచెందారు. ఆయన మృతదేహానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కర్నాటి విద్యాసాగర్, మాజీ జెడ్పీటీసీ ఏలుగొటి వెంకటేశ్వర్‌రెడ్డి, కత్తి రవీందర్‌రెడ్డి, గజ్జల శివారెడ్డిఉన్నారు.

**విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి**

**నార్కట్‌పల్లి :** విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని హైదరాబాద్‌లోని భారతీయ విద్యా మందిర్ పాఠశాల డైరెక్టర్ చామల రమాదేవి అన్నారు. మండల పరిధిలోని నక్కలపల్లి హైస్కూల్ విద్యార్థులకు శనివారం క్రీడా సామగ్రి, దుస్తులు పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సింగరి రాంమూర్తి, చిలుముల బాల్‌రెడ్డి, రవిబాబు, రేవతి ఉన్నారు.



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

**విద్యార్థులకు రక్తహీనత పరీక్షలు**

**నకిరేకల్ :** పోషణ మాసోత్సవంలో భాగంగా నకిరేకల్ మండల చందంపల్లి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు రక్తహీనత పరీక్షలు నిర్వహించారు. రక్తహీనత రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆపాఠశాల హెచ్ఎం కనుకుంట్ల నవీన్‌రెడ్డి, ఉపాధ్యాయుడు ఇంద్రకంటి గోవర్ధన్, వైద్య సిబ్బంది శివాని, సావిత్రి ఉన్నారు.

**అర్హులకు రేషన్ కార్డులు ఇవ్వాలి**

**కనగల్:** అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కనగల్ మండలం జి.యడవల్లి గ్రామంలో కానుగు లింగస్వామి అధ్యక్షతన నిర్వహించిన సీపీఎం గ్రామ శాఖ మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం పార్టీ గ్రామ నూతన కార్యదర్శిగా పర్సనబోయిన శంకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సభలో పాలడుగు ప్రభావతి, కానుగు లింగస్వామి, సుల్తానా, అక్రమ్, కొర్వి భిక్షం, నాగయ్య, రవి ఉన్నారు.

**బుడిగ జంగాలపై వేధింపులు మానుకోవాలి**

**మునుగోడు:** మునుగోడులో నివాసం ఉంటున్న బుడిగ జంగాలను రెవెన్యూ అధికారులు వేధించడం మానుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం డిమాండ్ చేశారు. మునుగోడు మండల కేంద్రంలోని సర్వే నంబర్ 78 స్థలంలో నివాసముంటున్న బుడిగ జంగాలను ఖాళీ చేయాలని రెవెన్యూ అధికారులు వేధించడాన్ని నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో శనివారం స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల కార్యదర్శి చాపల శ్రీను, తిరిపారి వెంకటేశ్వర్లు, బీసం ముత్తయ్య, బండారి శంకర్, తిరుపతయ్య, బుడిగ జంగాలు పాల్గొన్నారు.

**ముగిసిన దరఖాస్తుల స్వీకరణ**

**నల్లగొండ టూటౌన్:** నల్లగొండ ప్రెస్‌క్లబ్ ఎన్నికల్లో భాగంగా సభ్యత్వాల నమోదుకు ఈ నెల 24వ తేదీ నుంచి చేపట్టిన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ శనివారం ముగిసిందని ప్రెస్‌క్లబ్ అడ్ హక్ కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. జిల్లా కేంద్రంలో వివిధ పత్రికలు, చానల్స్‌లో పనిచేస్తున్న దాదాపు 320 మంది జర్నలిస్టులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఈ నెల 30, అక్టోబర్ 1వ తేదీల్లో స్క్రూటిని నిర్వహించి సభ్యత్వాలు జారీ చేస్తామని తెలిపారు.

**పెండింగ్ డీఏ విడుదల చేయాలి**

**శాలిగౌరారం:** ఉపాధ్యాయుల పెండింగ్ డీఏ విడుదల చేయాలని టీయూపీఎస్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అలుగుపల్లి పాపిరెడ్డి కోరారు. మండలంలోని వల్లాల గ్రామంలో గల ప్రభుత్వ మోడల్‌స్కూల్, మండలకేంద్రంలో గల కేజీబీవీల్లో శనివారం ఆ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సభ్యత్వ నమోదులో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు బత్తిని భాస్కర్, వెంకట్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, వాణి, పాండరి, యాదగిరి, మురళి పాల్గొన్నారు.

### ఏఈఈ ఉద్యోగానికి ఎంపిక



శ్యాంప్రసాద్

**నల్లగొండ:** కుటుంబ సభ్యుల ప్రోత్సాహం ఉంటే ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని నిరూపించారు.. నల్లగొండకు చెందిన గాలి శ్యాంప్రసాద్. నల్లగొండలో ఆప్టికల్ షాప్ నడుపుతూ జీవనం సాగిస్తున్న గాలి నరసింహ కుమారుడు శ్యాంప్రసాద్ ఇటీవల తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్( ఏఈఈ) పరీక్షలో ప్రతిభ చూపి ఉద్యోగం సాధించారు. ఇటీవల సీఎం చేతుల మీదుగా ఉద్యోగ నియామక పత్రాన్ని అందుకున్నారు.

### 'ఇంపాక్ట్' ఆధ్వర్యంలో ఉచిత వర్క్‌షాప్

**నల్లగొండ:** ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో శనివారం నల్లగొండ పట్టణంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఉచిత ట్రైనీ ది ట్రైనర్స్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంపాక్ట్ రీజినల్ ప్రెసిడెంట్ నూనె సుదర్శన్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు పెట్టుకుని ఇష్టంతో చదవాలన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను తీర్చిదిద్దడానికి 30 మంది ట్రైనర్లకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో రీజియన్ కోఆర్డినేటర్స్ కోటా సరిత, గూడూరు అంజిరెడ్డి, కోట్ల సాయికిరణ్, ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

### ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం

**నల్లగొండ:** వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేద్దామని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు డీవీఎస్.ఫణికుమార్ పిలుపునిచ్చారు. శనివారం నల్లగొండలోని ఆ సంఘం భవనంలో జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా డీవీఎస్ ఫణికుమార్, మేకల జానారెడ్డి, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా ఓరుగంటి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. అలాగే 250 మంది సభ్యులతో జంబో కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం చేశారు. జిల్లా అధ్యక్ష కార్యదర్శులను మండలాల అధ్యక్ష కార్యదర్శులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం మాజీ అధ్యక్షుడు సుంకరి భిక్షం గౌడ్, అసోసియేట్ అధ్యక్షులు తరాల పరమేష్ యాదవ్, కిరణ్ కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### వేతనాలు పెంచాలని వినతి

**చిట్యాల:** మున్సిపల్ కార్మికుల వేతనాలను పెంచాలని కోరుతూ శనివారం సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, కమిషనర్ వీరేంద్రకు వినతిపత్రాన్ని అందజేశారు.